






చంద్రబాబును సత్కరిస్తున్న మంత్రులు బీసీ, ఫరూక్, ఎంపీ, ఎమ్మెల్యేలు

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..!



ప్రాజెక్టు వివరాలను వివరిస్తున్న ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి

కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న చంద్రబాబు

చంద్రబాబుతో డోన్ ఎమ్మెల్యే కోట్ల

చంద్రబాబుతో సోమిశెట్టి వెంకటేశ్వర్లు

వాహనంలో ప్రయాణిస్తూ...

- వ్యవసాయ ఆధారిత, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు
- సీమలో కరువు లేకుండా చేస్తాం
- నీటిని కాపాడుకోవటం మన బాధ్యత
- శ్రీశైలం పర్యటనలో సీఎం నారా చంద్రబాబు నాయుడు



ఆలయంలో బైరెడ్డి శబరి, చంద్రబాబు, బుడ్డా రాజశేఖర్ రెడ్డి



సీఎం చంద్రబాబుతో శ్రీశైలం ఆలయ అర్చకులు, అధికారులు



శ్రీశైలం డ్యాం వద్దకు వెళ్తున్న చంద్రబాబు, కలెక్టర్ రాజకుమారి



చంద్రబాబును చూసేందుకు..



చంద్రబాబు వెంట టీడీపీ నేతలు మాండ్ర, బుడ్డా, బీసీ

శ్రీశైలం/నంద్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించి.. ఆ సంపదను పేదలకు పంచి అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించడమే తన లక్ష్యమని సీఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రతి చుక్క నీటిని ఒడిసి పట్టి రాయలసీమకు నీరు అందించి ఈ ప్రాంతంలో కరువు లేకుండా చేస్తానని, వ్యవసాయ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. శ్రీశైలం పర్యటనలో భాగంగా సుండిపెంట 'మన నీరు - మన సంపద' కార్యక్రమంలో వాటర్ యూజర్స్ అసోసియేషన్స్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 'నీరు చాలా విలువైనది. నీరు ఉంటే సాగు జరుగుతుంది. ఆహార ఉత్పత్తి నిండుగా వస్తుంది. రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరు అందించి ఉద్యాన తోటలు, పండ్ల తోటలు పండిస్తే రాయలసీమ రతనాల సీమ అవుతుంది. అన్ని రిజర్వాయర్లలో నీటిని పొదుపు చేసి వాటిని సద్వినియోగం చేసేలా డ్రిప్ ఇరిగేషన్ పెంచి నీటి వృథాను అరికట్టాలి. రాయలసీమలో నాలుగు ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. హైడ్రో విండ్ పవర్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్నా. అందుకోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నాం..' అని అన్నారు.

మల్లన్న స్వామి అనుగ్రహం లభించింది

స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి వస్తున్నానని, కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని చంద్రబాబు అన్నారు. 20 ఏళ్ల తరువాత జూలైలోనే శ్రీశైలం రిజర్వాయర్ నిండిందని.. ఇదంతా మల్లన్న స్వామి ఆశీస్సుల వల్లే అన్నారు. దివంగత ఎన్టీఆర్ రాష్ట్రానికి అనే సాగునీటి ప్రాజెక్టులు తీసుకువచ్చారని, కృష్ణా మిగులు జలాలు వాడుకోవచ్చన్నది ఆయన ఆలోచనేనని అన్నారు. ఎస్సార్బీసీ, గాలేరు, హంద్రీనీవా ప్రాజెక్టులు ఆయన మొదలు పెట్టినవేనని, దీనివల్ల రాయలసీమకు నీరు అందుతోందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులు అన్ని నిండుతున్నాయని, నీటిని జాగ్రత్తగా వాడుకుంటే సాగు బాగా ఉంటుందని, రాయలసీమలోని ప్రతి ఎకరాకు నీరు అందించే ఆలోచన చేస్తున్నామన్నారు.

మల్లన్న సన్నిధిలో చంద్రబాబు

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఉండవల్లి గ్రామం హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. తరువాత రోడ్డు మార్గాన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయం రాజగోపురం వద్దకు చేరుకున్నారు. ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రాలతో స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయం లోపలికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన రత్నగర్భ గణపతిని దర్శించుకుని మల్లికార్జున స్వామి, భ్రమరాంబదేవి అమ్మవారిని దర్శించుకుని అర్చనలు జరిపించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నారా చంద్రబాబుకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

- రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీశైలక్షేత్ర పర్యటనలో భాగంగా స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం 12:30 గంటలకు శ్రీశైలం జలాశయం చేరుకున్నారు. ఈ సందర్భంగా రాయలసీమ నీటిపారుదలకు సంబంధించి అన్ని ప్రాజెక్టుల ముఖచిత్ర మ్యాప్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలించారు. శ్రీశైల జలాశయం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి సాగునీటి ప్రాజెక్టుల వివరాలను సీఎంకు నివేదించారు. ప్రాజెక్టు పరిశీలన అనంతరం కృష్ణా నదికి జల హారతి ఇచ్చారు.
- కార్యక్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, రాయలసీమ ప్రాంతానికి దాదాపు రూ. 4 వేల కోట్ల రూపాయలను కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు రాయలసీమకు ఎగువన ఉందని, శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువన సిద్ధేశ్వరం వద్ద ఐకానిక్ బ్రిడ్జి మంజూరు అయిందని, ఇక్కడ బ్రిడ్జితో పాటు బ్యారేజి నిర్మిస్తే 60 టీఎంసీల నీరు సద్వినియోగం చేసుకోవచ్చని సీఎం చంద్రబాబును కోరారు. ఇందుకు చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారు.
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్ల వ్యవధి అనంతరం జూలై మాసంలో శ్రీశైలం జలాశయం నిండటం శుభదాయకమన్నారు. పట్టిసీమ ఏర్పాటు చేసి రాయలసీమకు నీరిచ్చిన ఘనత చంద్రబాబుదన్నారు. సుండిపెంట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గతంలో రూ. 17 కోట్ల మంజూరు చేశారని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ రాజకుమారి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, కోట్ల జయప్రకాశ్‌రెడ్డి, గిత్త జయసూర్య తదితరులు పాల్గొన్నారు.



సుండిపెంటలో వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న చంద్రబాబు

ఎట్టకేలకు పైపుల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- డైవర్షన్ రోడ్డుకు 13 పైపులు
- హంద్రీ-నీవా కాలువలో నీటి ప్రవాహం కోసం తాత్కాలిక ఏర్పాట్లు
- ఎన్‌హెచ్ఏఐ అధికారుల నిర్లక్ష్యంపై సీఎం చంద్రబాబు సీరియస్



హైవే నిర్మాణంలో భాగంగా హంద్రీ-నీవా కాలువపై నిర్మించిన డైవర్షన్ రోడ్డుకు ఏర్పాటు చేసిన పైపులు

కర్నూలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా డైవర్షన్ క్రాస్ రోడ్డుకు తాత్కాలికంగా పైపులు ఏర్పాటు చేశారు. రెండు వరుసల్లో 1.5 దయామీటర్లు పైపులు 13 పైపులు ఏర్పాటు చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. సుమారుగా వెయ్యి నుంచి 1,200 క్యూసెక్కులు నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఉండవని అంటున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా హంద్రీనీవా కాలువను పూర్తిగా పూడ్చేసి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయడమే కాకుండా సకాలంలో పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులపై సీఎం చంద్రబాబు సీరియస్ అయినట్లు తెలిసింది. గురువారం శ్రీశైలం వచ్చిన ఆయన యుద్ధప్రాతిపదిన పనులు చేసిన రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో హంద్రీనీవా ఇంజనీర్లు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు దగ్గరుండి తాత్కాలిక పైపులు ఏర్పాటు చేశారు. మల్యాల పంపింగ్ స్టేషన్ (పీఎస్)-1 నుంచి రెండు పంపులు ఆన్ చేసి హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు ఎత్తిపోస్తున్నారు. బ్రాహ్మణకొట్కూరు సమీపంలోని పీఎస్-2 నుంచి నీటిని ఎత్తిపోస్తే తాత్కాలిక పైపులు వెయ్యి క్యూసెక్కులకు పైగా ప్రవాహం కొనసాగుతుందా..? డైవర్షన్ క్రాస్ రోడ్డు నీటి ఒత్తిడికి నిలబడుతుందా..? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు-గుంటూరు వయా నందికొట్కూరు, ఆత్మకూరు జాతీయ రహదారి-340సీ నిర్మాణంలో భాగంగా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు సమీపంలో హంద్రీనీవా కాలువపై హైవే బిడ్జి నిర్మాణం చేపట్టారు. వాహనాలు రాక పోకల కోసం కాలువను ఎర్రమట్టితో పూడ్చేసి ట్రాఫిక్ డైవర్షన్ రోడ్డు నిర్మించారు. గడువులోగా కాలువపై హైవే బడ్జి నిర్మించి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు తొలగించకపోవడంతో కృష్ణా నది పరవళ్లు తొక్కుతున్నా రాయలసీమ కరువు రైతులకు సాగునీరు అందడం లేదు. దీనిపై ఆంధ్రజ్యోతి 'నీళ్లున్నా.. కన్నీళ్లే!' శీర్షిక వెలుగులోకి తెచ్చింది. ఎట్టకేలకు అధికారులు స్పందించి డైవర్షన్ క్రాస్ రోడ్డుకు తాత్కాలిక పైపులు ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చేశారు.

మురిపించన్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 1: సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లలో భాగంగా పేద ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవితాన్ని అందించే ఉద్దేశంతో చెప్పిన మాట ప్రకారం పింఛన్ల మొత్తాన్ని పెంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మేలు కలుగజేస్తుంది. అవ్వాతాతలతో పాటు, సంపాదన, ఆదరణ కరువైన వితంతు, చేనేత ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ఏఆర్టీ పింఛన్‌దారులకు 1వ తేదీన చంద్రబాబు ప్రభుత్వం అందజేస్తోంది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా 98.03 శాతంతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 2,43,337 పింఛన్లలో 2,38,540 పింఛన్లను అధికారులు పంపిణీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లను శుక్రవారంలోపు పంపిణీ చేయనున్నారు.

- పెరిగిన పింఛన్‌తో సామాజిక భద్రత
- లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన ఆనందం
- పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా టాప్

వృద్ధాప్యంలో భరోసా



నా వయస్సు 75 సంవత్సరాలు నా భార్య వయస్సు 70 సంవత్సరాలు మేమిద్దరం వృద్ధులం. మేము ఏ పని చేసుకోలేని పరిస్థితుల్లో పింఛన్ డబ్బులు మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నాము. పోయిన ప్రభుత్వంలో మాకు వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు వచ్చేది. చంద్రబాబు నాయుడు వచ్చాక రూ.4 వేలు వస్తోంది. చాలా సంతోషంగా ఉంది. గత నెలలో రూ.7వేలు తీసుకున్నాం.

- షేక్.మసీందార్ అజిత్ మియా, కండేరి వీధి,కర్నూలు

ఎన్టీఆర్ భరోసాతో కొండంత ఆసరా



2020 సంవత్సరంలో కరోనా సమయంలో మా భర్త కిడ్నీ ఫెయిల్యూర్‌తో చనిపోయాడు. అప్పటి నుంచి నేను టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం చేస్తున్నాను. నాకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. గత ప్రభుత్వంలో మాకు వితంతు పింఛన్ రూ.3వేలు వచ్చేది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం రూ.4 వేలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. **-అరుణ, చిదంబరరావు వీధి**

జిల్లాలో 2,43,337 మందికి లబ్ధి

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పథకం కింద జిల్లాలో ఆగస్టు నాటికి 2,43,337 మందికి రూ.103.54 కోట్లు లబ్ధి చేకూరింది. ఇందులో ఎక్కువగా వృద్ధాప్య పింఛన్లు 1,24,318 , వితంతు పింఛన్లు 71,303 మంది, దివ్యాంగ పింఛన్లు 31,340 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉదారగుణంతో 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వికలాంగులకు, డయాలసిస్ రోగులకు, పీఎల్‌హెచ్‌ఐవీ (ఏఈఆర్‌టీ) కుటుంబాలలో ఒకటి కన్నా పింఛన్లకు అనుమతి మంజూరు చేయడం జరుగుతోంది.

● మా పాలిట చంద్రబాబు దేవుడు



నేను ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడిని. 4 సంవత్సరాల కింద ప్రమాదంలో నాకు వెన్నెముక దెబ్బతిని మంచానికే పరిమితమయ్యా. గత ప్రభుత్వంలో రూ.5వేలు పింఛన్ తీసుకున్నా. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రూ.15వేలు పింఛన్ అందించాడు. ఈ డబ్బుతో నేను చికిత్స చేయించుకుంటున్నాను. సీఎం చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉన్నా.

- మహ్మద్ యూసుఫ్, కండేరి వీధి

రూ.103.54 కోట్ల పింఛన్లు పంపిణీ



వరలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్

కల్లూరు, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జిల్లాలో అర్హులైన 2,43,337 వివిధ రకాల లబ్ధిదారులకు రూ.103.54 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం ఉదయం 6 గంటలకే కలెక్టర్ కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చేరుకుని ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద అర్హులైన మస్తాన్‌బీ, లక్ష్మీదేవి, వరలక్ష్మిలకు వితంతు పింఛన్లు, రామాంజనేయులుకు వృద్ధాప్య పింఛన్ వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉదయం 6 గంటలకే పింఛన్లు పంపిణీ ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తొలిరోజే 100 శాతం పింఛర్లు పంపిణీ చేయాలని, ఒకటి, అరా మిగిలిపోతే రెండో రోజున పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, కల్లూరు ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివరాం పాల్గొన్నారు.

దిక్కులేని వారికి దేవుడయ్యాడు : వరలక్ష్మి, కల్లూరు, చిన్నటేకూరు

నా భర్త కొన్ని సంవత్సరాల కింద మరణించారు. అప్పటి నుంచి ఏదో ఒక పని చేసుకుంటూ జీవిస్తున్నాను. కొంత కాలం నుంచి ఆరోగ్యం బాగాలేక ఇంటి వద్దనే ఉంటున్నా. గతంలో ఇచ్చే పింఛన్ వైద్యానికి, మందులకు సరిపోయేది కాదు. అటువంటి సమయంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ. వేయి పెంచి రూ.4 వేలు పింఛన్ ఇంటి వద్దకే స్వయంగా కలెక్టరే వచ్చి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. సీఎం దిక్కులేనివారికి దేవుడయ్యాడు.

చిన్నటేకూరులో రామాంజనేయులుకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా



ఆర్థిక సమస్యలు తీరుతాయి

నాకు ఒక కుమారుడు ఉన్నాడు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోడానికి అతని సంపాదన సరిపోవడం లేదు. నా మందులకు ఆర్థికంగా చాలా ఇబ్బంది ఉండేది. ఈ సమయంలో సీఎం చంద్రబాబు రూ.4వేలు పింఛన్ ఇవ్వడంతో ఆర్థికంగా కొన్ని సమస్యలు తీరుతాయి.

- రామాంజనేయులు, చిన్నటేకూరు.

గ్రామీణ వైద్యాన్ని బలోపేతం చేస్తా

డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్



డా.ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 1: గ్రామీణ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలను బలోపేతం చేస్తానని కొత్త డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ తెలిపారు. డీఎంహెచ్‌వోగా ఆయన గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, అతిసార, డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో విషజ్వరాలు పెరగకుండా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే అనుచరుల నుంచి కాపాడండి

సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చిన బాధితురాలు

శ్రీశైలం, ఆగస్టు 1: నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అనుచరులు, గన్‌మెన్ నుంచి తమను కాపాడాలంటూ షబానా అనే మహిళ సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం పర్యటనలో ఉండగా ఆయనను కలిసి వినతి పత్రం అందించింది. తనది నంద్యాల మండలం కానాల గ్రామం అని, తన ఊరిలో సర్వే నంబరు 985లోని 44 సెంట్లు, అదే విధంగా ఇదే మండలంలోని రైతు నగర్‌లోని సర్వే నంబరు 285లోని 11 సెంట్ల భూమిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అనుచరులు బోయ భాస్కర్‌రెడ్డి, ఎన్ సుంకిరెడ్డి, గన్‌మెన్ చిన్ని కృష్ణ కబ్జా చేయటమే కాకుండా, తనపై దాడి చేశారని, ఈ విషయంపై అప్పటి ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆమె తెలియజేసింది. తమకు న్యాయం జరగకపోవటంతో గతంలో ఆత్మహత్యాత్నం చేశానని, టీడీపీ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరింది.

పేదల సొంతింటి కల చంద్రబాబుతోనే సాధ్యం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 1: పేదల సొంతింటి కల ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో శ్మశానాలు, వాగులు, వంకల్లో చాలీచాలని సెంటు స్థలం కేటాయించి పేదలకు ఇళ్లు లేకుండా చేశాడన్నారు. గతంలో టీడీపీ నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. వైసీపీ పాలనలో అన్ని శాఖల్లో ఆస్తులు తనఖా పెట్టి అప్పులు మిగిల్చారనీ ధ్వజమెత్తారు. భూముల సేకరణ పేరుతో వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారే తప్ప పేద ప్రజలకు ఇచ్చింది శూన్యమని మండిపడ్డారు.

● జిల్లాలో శ్రీశైలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడును టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి కలిసి జిల్లాలోని తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితులను వివరించారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణాలను కొందరు దుండగులు ధ్వంసం చేశారనీ వాటి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబును కోరారు.

వేరుశనగ క్వింటం రూ.6,929

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 1: ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగ ధర రికార్డ్ స్థాయిలో పలుకుతున్నాయి. గత వారంతో పోల్చితే వేరుశనగ ధర క్వింటానికి రూ.600పైగా పెరిగింది. బోరు బావులు, కాలువల కింద రైతులు సాగు చేసిన వేరుశనగ దిగుబడి ఇప్పుడిప్పుడే చేతి అందుతుందని రైతులు ధర ఆశాజనకంగా ఉండడంతో వేరుశనుగను మార్కెట్లో విక్రయించుకునేందుకు భారీగా తీసుకొస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోని ఆశించిన స్థాయిలో ధరలు ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 1,885 వేరుశనగ బస్తాలు విక్రయానికి రైతులు తీసుకురాగా వాటి కనిష్ట ధర క్వింటాలు రూ.3,900 గరిష్ట ధర రూ.6,929, మధ్యస్థ ధర రూ.6,419 పలికింది.

తుంగభద్రకు పోటెత్తిన వరద

కర్నూలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తుంగభద్రకు వరద పోటెత్తుతోంది. గత వారం పది రోజులుగా కొనసాగుతున్న వరద మరింత ఉధృతంగా మారుతోంది. కర్ణాటకలోని పడమటి కనుమల్లో కురుస్తున్న వర్షాలకు తుంగా, భద్ర, వరద నదులు పొంగి పొర్లుతున్నాయి. తుంగభద్రకు భారీగా వరద వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ఠనీటి మట్టం 1633 అడుగులు, పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, గురువారం రాత్రి 9 గంటల సమయంలో 2,01,636 క్యూసెక్కులు డ్యాంకు వరద వచ్చి చేరుతోంది. 1631.02 అడుగుల్లో 97.945 టీఎంసీలు నిల్వ చేసి 1,79,936 క్యూసెకులు నదికి విడుదల చేస్తున్నారు. అదే క్రమంలో సుంకేసుల బ్యారేజీకి 1.51లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వచ్చిన వరదను వచ్చినట్లుగా శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.



గురువారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో తుంగభద్ర ప్రాజెక్టు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

- టీడీపీకి మద్దతుగా ఓటు వేసిన వైసీపీ కార్పొరేటర్లు...
- ఒక్క ఓటుతో టీడీపీ కార్పొరేటర్ జక్కల రమణమ్మ ఓటమి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 1: నగర పాలక సంస్థకు జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగింది. వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ మద్దతుగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎంతో ఉత్కంఠగా సాగిన స్థాయి సంఘం సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం నూతన కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 12.30 గంటలకే 98.03 శాతం నమోదైంది. ఐదు స్థానాలకు 10 మంది పోటీ పడిన విషయం తెలిసిందే. మూడు నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 52 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇందులో 42వ వార్డు కార్పొరేటర్ కాశిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఓ కేసులో జైలుకు వెళ్లారు. అంతే కాకుండా 27వ వార్డు కార్పొరేటర్ పల్లె శారద విదేశాల్లో ఉండటంతో ఓటు వేయలేకపోయారు. మొత్తం 51 మందికి గాను 50 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెవెన్యూ ఆఫీసర్ జునైద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ ఇజ్రాయేల్, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, రామక్రిష్ణ, ఉద్యోగులు తిమ్మప్ప, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన వైసీపీ కార్పొరేటర్లు: విక్రమసింహరెడ్డి (40 వార్డు), క్రాంతికుమార్ (12వ వార్డు)జుబేర్ అహ్మద్ (7వ వార్డు) చిట్టెమ్మ మిద్దె(31వ వార్డు) యూనుస్ బాషా(10వ వార్డు). వీరందరికి కమిషనర్ పివి. రామలింగేశ్వర్ నియామకపత్రాలను అందజేశారు. గెలిచిన సభ్యులు రానున్న ఏడాది పాటు స్టాంగింగ్ కమిటీ సభ్యులుగా ఉంటారు. నగరపాలక సాధారణ నిధులకు పది నుంచి యాభై లక్షల అభివృద్ధి పనులకు వీరి ఆమోదం తప్పనిసరి.

టీడీపీకి ఓటేసిన వైసీపీ కార్పొరేటర్లు: ఒక్కో కార్పొరేటర్ ఐదుగురికి ఓటు వేయాలి. దీంతో ఈ లెక్కన మొత్తం టీడీపీ కార్పొరేటర్‌కు తన ఓటుతో కలిపి 18 ఓట్లు మాత్రమే రావాలి. ఈ క్రమంలో టీడీపీ 24వ వార్డు కార్పొరేటర్ జక్కల రమణమ్మకు 25 ఓట్లు, 16వ వార్డు కార్పొరేటర్ విజయకుమారికి 24 ఓట్లు, 3వ వార్డు కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్‌కు 20 ఓట్లు, 6వ వార్డు కార్పొరేటర్ నీలోఫర్ షేక్‌కు 19 ఓట్లు, 15వ వార్డు కార్పొరేటర్ శివమ్మకు 18 ఓట్లు వచ్చాయి. దీంతో జక్కల రమణమ్మకు 7 ఓట్లు, విజయకుమారికి 6 ఓట్లు, పర్వీన్‌కు 2 ఓట్లు, నీలోఫర్‌కు ఒక్క ఓటును వైసీపీ కార్పొరేటర్లు వేశారు. దీంతో జక్కల రమణమ్మ ఒక్క ఓటుతో పరాజయం పొందారు.



నియామకపత్రాన్ని అందజేస్తున్న కమిషనర్ పివి. రామలింగేశ్వర్

కూటమి కొట్లాటతో విద్యార్థుల పస్తు

- పాఠశాలలో అన్నం వండినా... విద్యార్థులకు వడ్డించని వైనం...
- ఆదోని మండలంలో చాలా పాఠశాల్లో ఇదే దుస్థితి...
- మధ్యాహ్న భోజనానికి సమస్యగా కూటమి కొట్లాటలు

ఆదోని రూరల్, ఆగస్టు 1 : ఉపాధ్యాయులు రాజకీయాలతో కూటమి కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే విషయంలో గొడవలకు దిగారు. దీని వల్ల విద్యార్థులకు పస్తు ఉండక తప్ప లేదు. మండలంలోని గణేకల్లులో కూటమి అధికారం చేపట్టిన తరువాత కూటమి నాయకుల సమక్షంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే బాధ్యతను గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హనుమంతరెడ్డికి జూలై 1నుంచి అప్పగించారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కొండయ్య వచ్చి ఎమ్మెల్యే పార్థసారధి తనకు లెటర్ ఇచ్చారని, పాఠశాలలో వంట తాను వండుతానని ఉపాధ్యాయులకు చెప్పాడు. టీడీపీ వాళ్లు ఆగస్టు 1వ తేది నుంచి వంట చేయడానికి వీల్లేదని చెప్పాడు. గురువారం కొండయ్య వంట చేయడానికి వెళ్లే సరికి టీడీపీ కార్యకర్త హనుమంతరెడ్డి పిల్లల కోసం సాంబరు బాత్ సిద్ధం చేశాడు. ఈ క్రమంలో టీడీపీ, బీజేపీ కార్యకర్తల మధ్య గంటల తరబడి పాఠశాల ఆవరణలో ఘర్షణ జరిగింది. అప్పటికే 12గంటలు దాటడంతో విద్యార్థులు ఇంటికెళ్ళి భోజనం చేసి రావాలని ఉపాధ్యాయులు చెప్పి, వాళ్లను బయటకు పంపి పాఠశాలకు గేట్లు వేసేశారు. పాఠశాలలో 1నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 506 మంది ఉన్నారు. వీరిలో 389మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ గొడవ వల్ల భోజనం వండినా... విద్యార్థులకు పెట్టకుండా ఉపాధ్యాయులు రాజకీయం చేసి విద్యార్థులను ఇంటికి పంపించారంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దహరివాణం, ఇస్వీ, హనవాళ్‌తోపాటు తదితర గ్రామ ప్రభుత్వ పాఠశాలలో కూడ ఇదే దుస్థితి దాపురించింది.

వండిన అన్నం పిల్లలకు పెట్టొద్దన్నారు

నెల క్రితం కూటమి నాయకులంతా కలిసి జూలై 1నుంచి హనుమంతురెడ్డి పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ చూసుకుంటాడని చెప్పారు. అయితే ఆగస్టు 1 నుంచి తాను వంట చేస్తామని కొండయ్య ఎమ్మెల్యే లెటర్ తీసుకొచ్చాడు. గురువారం హనుమంతరెడ్డి మధ్యాహ్న భోజనం తయారు చేశాడు. ఆ భోజనాన్ని పిల్లలకు పెట్టకూడదని కొండయ్య చెప్పడంతో పెట్టలేకపోయాం. నేటి నుంచి అలాంటి పరిస్థితి రాకుండా చూసుకుంటాం.

ఇబ్రహీం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గణేకల్లు



బడిలో అన్నం పెట్టకపోవడంతో ఇంటికెళ్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

ఆదోని, ఆగస్టు 1: ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్ ఇంట్లో చోరీ జరిగింది. గత నెల 2వ తేదీన బాధితుడు వీరచంద్ర యాదవ్ మామ ఆరోగ్యం బాగా లేకపోతే డీన్ పట్టడానికి ఇంటికి తాళం చేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. బుధవారం సాయంత్రం చూడగా బీరువా తాళాలను పగలగొట్టి బీరువాలోని బట్టలు వస్తువులన్నీ బయట వేసి అందులో దాచిన రూ.1.40లక్షల నగదుతో పాటు మూడు తులాల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర కిలో వెండి ఆభరణాలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ గోపి తెలిపారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

● మరో నిందితుడి కోసం గాలింపు



నిందితులను అరెస్ట్ చేసి చూపుతున్న పోలీసులు

గూడూరు, ఆగస్టు 1: గూడూరు పట్టణంలో సంచలనం రేపిన బంగారు నగల వ్యాపారి కిడ్నాప్ కేసులో ఇద్దరి నిందితులను అరెస్టు చేసామని, మరో నిందితుడితోపాటు వీరికి సహకరించిన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య వెల్లడించారు. గురువారం గూడూరు పోలీసు స్టేషన్ ఆవరణలో బంగారు నగర వ్యాపారి డమాం వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ గత నెల 29 మధ్యాహ్నం గూడూరు పట్టణంలో డమాం వెంకటేశ్వర్లును ఎమ్మిగనూరు రోడ్డులో దాల్ మిల్ షట్టర్ల దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు స్కార్పియో వాహనంలో కిడ్నాప్ చేశారని అన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిందితులను పట్టుకొనేందుకు టీంలను ఏర్పాటు చేశామన్నారు. కిడ్నాప్‌లో పాల్గొన్న మూడో వ్యక్తిని పట్టుకోడానికి గాలిస్తున్నట్లు తెలిపారు.

డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను ఉత్పత్తి చేయండి

జెన్‌కో అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం



పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

శ్రీశైలం, ఆగస్టు 1: శ్రీశైలం హైడెల్ పవర్ ప్రాజెక్టు ద్వారా డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచుకునే సౌలభ్యం ఉందన్నారు. శ్రీశైలం జలాశయం ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం కుడి హైడెల్ పవర్ కేంద్రాన్ని సందర్శించి జెన్‌కో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారించాలని అధికారులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రెన్యుబల్ ఎనర్జీకి కీలక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, డైరెక్టర్ సుజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఇంజనీర్లను నియమించండి

- పదోన్నతులపై ప్రజాభిప్రాయ సేకరణ
- ఇరిగేషన్ అడ్మిన్ శ్రీనివాస్

కర్నూలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో ఇంజనీర్ల పదోన్నతులపై ఆ శాఖ ఈఎన్‌సీ (అడ్మిన్) శ్రీనివాసులు గురువారం అభిప్రాయ సేకరణ చేపట్టారు. జోన్-4 పరిధిలోని ఇంజనీర్లతో సీఈ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పదోన్నతుల మీద ఇంజనీర్ల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎఫ్‌ఏసీల పేరుతో జూనియర్లను కూడా ఉన్నత స్థానాల్లో నియమించి సీనియర్ ఇంజనీర్లను అవమానిస్తున్నారనీ, ఎఫ్‌ఏసీలను రద్దు చేసి రెగ్యులర్ ఇంజనీరింగ్ అధికారులను నియమించాలని పలువురు ఇంజనీరింగ్ అధికారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే జోన్-2, 3 పరిధిలో అభిప్రాయాల సేకరణ పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో 2016లో ఇంజనీర్లకు పదోన్నతులు ఇస్తే తెలంగాణ హైకోర్టు దానిని రద్దు చేసిందన్నారు. ఇప్పటి వరకు పదోన్నతులు లేకపోవడంతో ఇంజనీర్లు చాలా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ముగ్గురు ఈఎన్‌సీలు, 15 మంది సీఈలు, 50 మంది ఎస్ఈలు, దాదాపు 170 మంది ఈఈలు జలవనరుల శాఖలో ఫుల్ అడిషినల్ పేరిట ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారనీ అన్నారు. ఇంజనీర్ల అభిప్రాయ సేకరణ అనంతరం ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే

గూడూరు, ఆగస్టు 1: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం గూడూరు మండలంలోని కె నాగలాపురం, పెంచికలపాడు, బుడిదపాడు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలందరికీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.నయోమి, టీడీపీ నాయకులు జె.సురేష్, గోపాల్‌రెడ్డి, కృష్ణ, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం చిన్న గిడ్డయ్య, బంగారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

● గూడూరు నగర పంచాయతీ పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ దివాకర్ రెడ్డి, ఏఈ నరసింహులు, టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నగర పాలక సంస్థ ఘనత

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో నగరపాలక సంస్థ అరుదైన ఘనత సాధించింది. నగరంలో గురువారం తొలిరోజే సాయంత్రం 6 గంటలలోపు 98.20 శాతం పింఛన్లను పంపిణీ చేసి రికార్డు సృష్టించారు. గత నెల పింఛన్ల పంపిణీలో అట్టడుగు స్థానంలో ఉండటంతో ముందస్తు ప్రణాళికతో నగరపాలక కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. అంతకు మునుపు పీవీ రామలింగేశ్వర్ 51 సచివాలయ పరిధిలోని కమలానగర్‌లో లబ్ధిదారులు కె. ఈశ్వరయ్య, పద్మమ్మ, మంగలి లక్ష్మీదేవిలకు నగదు అందజేశారు.


ఓర్వకల్లులో..

ఓర్వకల్లు: మండలంలో పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఓర్వకల్లులో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సోమయాజులపల్లెలో డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, నన్నూరులో ఎంపీడీవో మల్లేశ్వరి, మండలంలోని ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు పింఛన్ల పంపిణీ ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు.

కోడుమూరు: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొందని టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు కేఈ మల్లికార్జునగౌడ్ అన్నారు. టీడీపీ నాయకులు గురువారం ఉదయం 6గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల పక్షపాతి అని అమడగుంట్ల సర్పంచ్ వరలక్ష్మి కొనియాడారు. గురువారం ఉదయాన్నే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును అందించారు. నాయకులు రమేష్, సురేష్, శ్రీనివాసరెడ్డి, రవికిషోర్, శ్రీనివాసులు, వై వెంకటేశ్వర్లు, సర్దార్, రంగస్వామి పాల్గొన్నారు.

● మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ 98.39 శాతం పూర్తయిందని ఎంపీడీవో దివ్య తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో వివిధ రకాల పింఛన్లు 9,034 ఉండగా 8,889 మందికి లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన లబ్దిదారులకు శుక్రవారం సాయంత్రంలోగా పూర్తి చేస్తామని అన్నారు.

సి.బెళగల్: మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో పింఛన్ల పంపిణీ టీడీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు ముమ్మరంగా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి తదితరులు పాల్గొన్నారు.


గూడూరు మండలం కె.నాగలాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి


కర్నూలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కమిషనర్


కోడుమూరు పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

‘అన్న క్యాంటీన్ల పనులను పూర్తి చేయాలి’


అన్న క్యాంటీన్ల పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 1: నగరంలో జరుగుతున్న అన్న క్యాంటీన్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం పాతబస్టాండు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, సెట్కూరు కార్యాలయం, పరిమళ నగర్‌లలో అన్ని క్యాంటీన్ల ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ కమిటీ నిర్ణయం మేరకు ఎన్‌క్యాప్ కార్యక్రమం ద్వారా రూ.50లక్షలతో బళ్లారి చౌరస్తా వద్ద హైదరాబాదు, కోడుమూరు మలుపు వద్ద ఐ ల్యాండ్స్ వెడల్పు తగ్గిస్తూ, ఫ్లైఓవర్ కింద గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట ఎంఈ షాకీర్ హుస్సేన్, డీఈఈలు, ఏఈఈలు ఉన్నారు.

ఇంటింటా చెత్తను సేకరించాలి : నగరంలో పారిశుధ్య సిబ్బంది ప్రతి రోజూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. గురువారం నగరంలోని మాధవీ నగర్, బంగారుపేట, బళ్లారి చౌరస్తా ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అలాగే పూడికతీత పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఇన్స్‌పెక్టర్లు రాజు, మునిస్వామి ఉన్నారు.

కర్నూలు రూరల్ తహసీల్దార్‌గా రమేష్‌బాబు


రమేష్‌బాబు

కర్నూలు(రూరల్), ఆగస్టు 1: కర్నూలు రూరల్ మండల తహసీల్దార్‌గా టి.వెంకట రమేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కల్లూరు మండలం తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయనను సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కడప జిల్లా పులివెందులకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికలు ముగిసిన తర్వాత రమేష్ బాబును తిరిగి కర్నూలు జిల్లాకు బదిలీ చేస్తు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈక్రమంలో కలెక్టర్ రంజిత్‌బాషా రమేష్ బాబును కర్నూలు రూరల్ మండల తాహశీల్దార్‌గా కేటాయించారు. ఈసందర్భంగా ఆయన కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి తన నియామక పత్రాన్ని సమర్పించారు. అనంతరం రూరల్ తాహశీల్దార్ కార్యాలయంలో నూతన బాధ్యతలు తీసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ శివ, సిబ్బంది రమేష్‌బాబుకు పూలబొకె ఇచ్చి అభినందనలు తెలిపారు.

● కర్నూలు అర్బన్ మండలం తహసీల్దార్‌గా ఎస్.రామాంజనమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ గిరికుమార్‌రెడ్డి పులబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.

కల్లూరు తహసీల్దార్‌గా కే.రామాంజనేయులు

కల్లూరు: కల్లూరు మండల తహసీల్దార్‌గా కే.రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. గురువారం కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు మండల అధికారులు పూలబొకేలు అందజేశారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ మునివేలును కల్లూరు మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.

కోడుమూరు తహసీల్దార్‌గా వెంకటేశ్‌నాయక్

కోడుమూరు, ఆగస్టు 1: కోడుమూరు తహసీల్దార్‌గా వెంకటేశ్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కూడా ఈయన 2013లో కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్‌గా, 2019లో తహసీల్దార్‌గా కేవలం విధులు నిర్వహించారు. బదిలీలో భాగంగా రెండో సారిగా తహసీల్దార్‌గా తిరిగి కోడుమూరుకు వచ్చారు.

భార్య, అత్తపై దాడి చేసిన అల్లుడు

కోడుమూరు(రూరల్), ఆగస్టు 1: మండలంలోని పులకుర్తి గ్రామంలో భార్యతోపాటు ఆమె తల్లిపై అల్లుడు దాడి చేసి తీవ్రంగా గాయ పరచాడు. ఎస్ఐ బాలనరసింహులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సుంకన్న, లక్ష్మీదేవి దంపతుల కూతురు మల్లేశ్వరీని బస్తిపాడుకు చెందిన రంగడుకు ఇచ్చి వివాహం జరిపించారు. భర్త రంగడు తాగుడుకు అలవాటు పడి కుటుంబాన్ని పట్టించుకోక పోవడంతో మల్లేశ్వరీ పిల్లలతో కలిసి ఇటీవలే పుట్టింటికి చేరుకుంది. వెంట చేరుకున్న భర్త రంగడు మంచిగా పనిచేసుకుంటానని అత్త మామలను నమ్మించాడు. బుధవారం అర్ధరాత్రి పూటుగా తాగి వచ్చి గొడవకు దిగాడు. భార్య మల్లేశ్వరీ, అత్త లక్ష్మీదేవిలను రోకలిబండతో తలపై కొట్టాడు. అడ్డుగా వెళ్లిన మామ సుంకన్నపై కూడా దాడి చేయడంతో చేతులకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలపాలైన మల్లేశ్వరీ, లక్ష్మీదేవిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూగజీవాల దాహార్తి తీర్చండి

కోడుమూరు(రూరల్), ఆగస్టు 1: మూగజీవాల దాహార్తి తీర్చుటకు కుంటలు, చెక్‌డ్యాంలకు ఎల్లెల్సీ కాలువ ద్వారా నీటిని నింపాలని గొర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్యాలకుర్తి ఎర్ర మద్దిలేటి కోరారు. గురు వారం ఆయన మాట్లాడుతూ సరైన వర్షాలు లేక మూగజీవాల దాహార్తి తీర్చుటకు యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే సమయంలో ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర నదిలో వరద ప్రవాహం ఉందన్నారు. దీంతో ఎల్లెల్సీ కాలువ ద్వారా కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో వివిధ చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలకు నీరు విడుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లిపాలు ఎంతో శ్రేష్ఠం

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 1: పుట్టిన బిడ్డలకు తల్లిపాలు అందించాలని, తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. చిట్టినరసమ్మ అన్నారు. గురువారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం కర్నూలు జీజీహెచ్ మెటర్నిటీ విభాగంలో హెచ్‌వోడీ శ్రీలక్ష్మి అధ్యక్షతన గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో గైనకాలజీ విభాగపు ప్రొఫెసర్లు డాక్టర్ సావిత్రి, పద్మజ, వరలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నర్మద, నర్సింగ్ కాలేజీ ట్యూటర్లు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కేశవరెడ్డి విద్యార్థులు


ప్రశంసాపత్రాలు, మెడల్స్‌తో కేశవరెడ్డి విద్యార్థులు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 1: అవుట్‌డోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.కేశవరెడ్డి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయవచ్చని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించాలి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 1: జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. గురు వారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

‘ఎస్సీ వర్గీకరణపై తీర్పు హర్షణీయం’

కర్నూలు(రూరల్), ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కర్నూలు పాతబస్టాండ్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర నాయకుడు పేరపోగు పెద్దలక్ష్మన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పూలమాల వేసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ అవసరమని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన చారిత్రకమైనదని అన్నారు.

● కర్నూలు కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కర్నూలు(అర్బన్): ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని తెలుగు యువత ఉపాధ్యక్షుడు పేరపోగు రాజు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సుప్రీం కోర్టు తీర్పు పట్ల స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గున్నామార్క్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పేరపోగు మారెన్న పాల్గొన్నారు.

కర్నూలు(లీగల్): ఎస్సీల వర్గీకరణపై సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై కర్నూలు మాదిగ లాయర్స్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ వర్గీకరణతో మాదిగలకు విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని ఫెడరేషన్ న్యాయవాదులు తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం సమీపంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల మాదిగ జాతి యావత్ మందకృష్ణ మాదిగ చేసిన కృషిని మరిచిపోరన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు న్యాయవాది బీఎస్ రవికాంత్ ప్రసాద్, ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ మెం బర్ ప్రభాకర్, న్యాయవాదులు ఎం.త్రివిక్రమ్, ఏ.మాదన్న, పి.దస్తగిరి, ఎస్.రాజేష్, ఈ.రాజేష్ హర్షం వ్యక్తం చేశారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, సి.బెళగల్‌లో..

సి.బెళగల్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకుడు నాగరత్నం అన్నారు. గురు వారం సి.బెళగల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు బీమన్న, రత్నం, దేవదానం, బజారి, నాగన్న పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ స్కీం కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వం కొందరి రోగులకు పింఛన్ పెంచడానికి అనుమతులు జారీ చేసింది. వీల్‌చైర్లు, బెడ్‌కు మాత్రమే పరిమితమైన రోగులకు ప్రమాదాలు జరిగిన వారికి మస్కులర్ డిస్ట్రఫీ ఉన్న రోగులకు పింఛన్‌ను రూ.5వేలు నుంచి రూ.15 వేలకు పెంచడానికి నిర్ణయించిందని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రెండు కాళ్లకు బోదకాలు వ్యాపించిన వారికి ప్రత్యేక పరిస్థితుల్లో కిడ్నీ డయాలసిస్ చేసుకునే రోగులకు నిబంధనలను అనుసరించి కిడ్నీ, కాలేయం, హార్ట్ మార్పిడీ చేసుకున్న రోగులకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు పింఛన్ పెంచారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు జీజీహెచ్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ స్కీం మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు జారీ కోసం మెడికల్ టీంను ఏర్పాటు చేస్తూ డీఎంఈ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ స్కీం.. మెడికల్ బోర్డు సభ్యులు వీరే..

- డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్, చైర్మన్
- సి.శ్రీనివాసులు, న్యూరాలజీ, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ
- ఎం.మంజులబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ సభ్యులు
- జి.మోహన్ రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ సభ్యులు
- ఎస్.అనంత్ నెఫ్రాలజీ హెచ్‌వోడీ సభ్యులు
- జి.రామ్‌బాలాజీ నాయక్, న్యూరోసర్జన్ సభ్యులు
- ప్రశాంత్, కార్డియాలజీ, వైద్య నిపుణులు
- కేఎం ఇక్బాల్ హుసేన్, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ
- డి.నాగేశ్వరరావు, సైక్రియాట్రి, హెచ్‌వోడీ
- పీఎస్ఎల్ సౌజన్య, న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్
- బి.వెంకటేశ్వరరావు సీఎస్ఆర్ఎంవో
- హేమనళిని డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో

ప్రతి బుధవారం ధన్వంతరి హాలులో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ సర్టిఫికెట్లు కావాల్సిన వారు ముందుగానే తమ ఫోన్ నెం బర్ ఇచ్చి నమోదు చేసుకోవాలని, తమ సర్టిఫికెట్లను వివరాలను సూపరింటెండెంట్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ జమాల్‌కు అందజేయాలన్నారు. సీనియారిటీ ప్రకారం పిలిచి అందరికీ దఫాల వారీగా సర్టిఫికెట్లు అందజేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

ఎస్పీని కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే


ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), ఆగస్టు 1: కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం కర్నూలు జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పాతబస్టాండ్‌లోని డీపీవో కార్యాలయంలో ఆయన చాంబర్‌కి వెళ్లి ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి సత్కరించారు. అనంతరం పోలీస్ శాఖలో జరుగుతున్న బదిలీల నేపథ్యంలో కోడుమూరు నియోజకవర్గం సంబంధించిన సీఐ, ఎస్ఐల నియామకంపై ఎమ్మెల్యే దస్తగిరి ఎస్పీతో చర్చించారు.

జలహారతిలో చంద్రబాబుతో సోమిశెట్టి


చంద్రబాబుతో సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 1: శ్రీశైలం డ్యాం జలహారతికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమ రాంబ అమ్మవార్ల దర్శనానంతరం జరిగిన పలు కార్యక్రమాల్లో చంద్ర బాబు వెంట ఆయన పర్యటించారు. కార్యక్రమంలో కర్నూలు నగర కార్యదర్శి నాగరాజు యాదవ్, పలువురు ఉమ్మడి జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోగా రాజేశ్వరి బాధ్యతల స్వీకరణ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 1: కలెక్టరేట్ ఏవోగా పి.రాజేశ్వరి గురు వారం బాధ్యతలు స్వీకరించారు. డీఆర్వో కార్యాలయం సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్ర మంలో రాజు, వెంకటేశ్వర్లు, సందీప్, జనార్దన్, శివ, పార్వతి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 1: కూటమి ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం కేకే భవన్ ఆవరణలోని ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయ కులు జి.రామక్రిష్ణ, సీహెచ్.శ్రీనివాసులు, శేషాద్రి, సి.రాముడు, జయమ్మ పాల్గొన్నారు.

మాజీ మంత్రి వి.రాంభూపాల్‌చౌదరి జయంతి


వి.రాంభూపాల్ చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు, టీడీపీ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 1: వి.రాంభూపాల్ చౌదరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో దివంగత మాజీ మంత్రి వి.రాంభూపాల్‌చౌదరి 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం సొసైటీ అధ్యక్షుడు వై.రామేశ్వరరెడ్డి అధ్యక్షతన భూపాల్ కాంప్లెక్స్‌లో రాంభూపాల్ చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంభూ పాల్ చౌదరి మంత్రిగా ఉన్న సమయంలో ప్రతి గ్రామానికి మంచి నీటి సౌకర్యం, ఇళ్లపట్టాలు, నగరంలో ఉస్మానియా కళాశాల నుంచి బుదవారపేట మీదుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో రాంభూపాల్ చౌదరి తనయుడు వీ.నవీన్‌చౌదరి, సొసైటీ ఉపాధ్యక్షురాలు షేక్ పర్వీన్ జబీనా, టీడీపీ నాయకులు లాయర్ లక్ష్మీనారాయణ, జేమ్స్, చక్రపాణి యాదవ్, మద్దిలేటి, వెంకటేష్, సుంకన్న, బీవీ రమణ పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 1: కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కులవివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. గురువారం నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో కేవీపీఎస్ జిల్లా స్థాయి సామాజిక చైతన్య శిక్షణ తరగతులను ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం సామాజిక సమస్యలపై కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు టి.రాముడు పాల్గొన్నారు.

‘ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ బిల్లుకు వైసీపీ మద్దతు ఇవ్వలేదు’

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ బిల్లుకు గత వైసీపీ ప్రభుత్వం మద్దతు ఇవ్వలేదని, అసలు ఈ వర్గీకరణ బిల్లు పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి మూలింటి మారెప్ప అన్నారు. గురువారం నగరంలోని బి.క్యాంపులోగల ఆయన ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మారెప్ప మాట్లాడుతూ నేడు ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో తీర్పు ఇచ్చారని, ఆ తీర్పుతో ఎస్సీ, ఎస్టీల్లో వెనుకబడిన కులాలకు లబ్ధి జరుగుతుందని అన్నారు.

వైద్యులు నిరంతర విద్యార్థులు


శిక్షణలో పాల్గొన్న వైద్యులతో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 1: వైద్యులు నిరంతర నేర్చుకొనే విద్యార్థి అని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ అన్నారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం బేసిక్ కోర్సు ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ మాట్లాడుతూ వైద్యులకు పదోన్నతులు పొందాలంటే ఈ శిక్షణ తప్పనిసరి అని అన్నారు. ప్రతి బ్యాచ్‌లో 30 మంది వైద్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈయూ కోఆర్డినేటర్ డా.సింథియా శుభప్రద, వైస్ ప్రిన్సిపాల్స్ రేణుకాదేవి, హరిచరణ్, ఎంఈయు సభ్యులు పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా.విజయానందబాబు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తయారీలో వివాదం

భోజనం తయారు చేసిన ఉపాధ్యాయులు

కల్లూరు, ఆగస్టు 1: కల్లూరు మండలం బస్తిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేయడంలో పొదుపు సంఘాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గురువారం మధ్యాహ్న భోజనం తయారీ ఏజెన్సీకి మరో పొదుపు సంఘానికి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ గఫూర్ తెలిపారు. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులు వంట చేయకపోవడంతో దాదాపు 260 మంది పిల్లలను పస్తులుంచడం ఇష్టంలేని ఉపాధ్యాయులంతా ఒకచేయి వేసి విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశామని హెచ్ఎం అబ్దుల్ గఫూర్ తెలిపారు. కల్లూరు మండలం విద్యాధికారి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా పాత ఏజెన్సీ వారితోనే భోజనం ఏర్పాటు చేయించాలని హెచ్ఎంకు సూచించారు.

మొరాయిస్తున్న డిజిటల్ సేవలు

అయోమయంలో బ్యాంకు ఖాతాదారులు


హుశేనాపురం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఇదే

ఓర్వకల్లు, ఆగస్టు 1: మండలంలోని హుశేనాపురం గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో డిజిటల్ సేవలు సేవలు మొరాయిస్తుండటంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదు రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని ఖాతాదారులు, వినియోగదారులు వాపోతున్నారు. వినియోగదారులు ఇతర బ్యాంకు ఖాతాలకు లావాదేవీల కోసం తక్షణమే డబ్బులు పంపడానికి యుపీ ఐని వినియోగించే గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే సేవలు పని చేయకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి యూపీఐ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఖాతాదారులు కోరుతున్నారు.

గోపాల్‌రావు మృతి తీరనిలోటు

ఓర్వకల్లు, ఆగస్టు 1: మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన కాంపౌండర్ గోపాల్‌రావు మృతి తీరని లోటని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గోపాల్‌రావు మృతి చెందడంతో గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపాల్‌రావు 30 సంవత్సరాలుగా హుశేనా పురం పీహెచ్‌సీలో కాంపౌండర్‌గా విధులు నిర్వహించి ప్రజల మన్న నలు పొందారని గ్రామస్థులు కొనియాడారు. ఆయన అంత్యక్రి యలు గ్రామంలో ఘనంగా జరిగాయి.

హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 1: జిల్లాలో ఉన్న కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు అందరినీ రెగ్యులర్ చేయాలని ఏపీ హంసా వైద్య ఉద్యో గుల సంఘం డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్‌ను కోరింది. గురువారం సాయంత్రం కొత్త డీఎంహెచ్‌వోకు సంఘం నేతలు కలిసి అభినంద నలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ హంసా జిల్లా అధ్యక్షుడు రఘు బాబు, కర్నూలు సిటీ అధ్యక్షుడు టి.గోవిందు, అసోసియేట్ ప్రెసి డెంటు మద్దూరు వెంకటస్వామి, వైస్.ప్రెసిడెంటు సంపత్, కర్నూలు ఉమెన్ వింగ్ సెక్రటరీ ప్రసూనా, జిల్లా నాయకులు కరుణానిధిమూర్తి పాల్గొన్నారు.

పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

సి.బెళగల్, ఆగస్టు 1: పాఠశాలల యాజమాన్య కమిటీకి ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను గురువారం ప్రధానోపాధ్యాయులు కిశోర్ విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయులు కిశోర్ మాట్లాడుతూ 5 తేదీ నుంచి 8 వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కమిటీ సభ్యుల ఎన్నిక జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు అను మంతు, నాగన్న, మునిస్వామి తిమ్మన్న, రేవుల శ్రీను పాల్గొన్నారు.

‘క్రిమిసంహారక మందులకు బిల్లులివ్వాలి’: రైతులకు విక్రయించే క్రిమి సంహార మందులకు షాపుల యజమా నులు బిల్లులు ఇవ్వాలని, లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేసి దుకాణం సీజ్ చేస్తామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం, గ్రామాల్లోని పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణం యజమానులు రైతులకు విక్రయించే ప్రతిదానికి బిల్లులు ఇవ్వాలన్నారు.

సూర్యోదయంలోపే పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



ఆలూరు మండలం అరికెర తండాలో పింఛన్ పంపిణీ చేస్తున్న వైకుంఠం శివప్రసాద్, జ్యోతి దంపతులు



ఆస్పరిలో సూర్యోదయానికి ముందే లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న దృశ్యం





పింఛను అందజేస్తున్న బీవీ, రాఘవేంద్రరెడ్డి

ఆదోని, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ రికార్డు స్థాయిలో జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉదయం 6గంటలకే పింఛన్ల పంపణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఇళ్ల వద్దే సచివాలయ సిబ్బంది పింఛన్ మొత్తం అందజేసే ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకల్లా 75 శాతం పైగా పింఛన్ల పంపిణీ పూర్తయింది. ఆదోని మున్సిపాలిటీలోని అంబేడ్కర్ నగర్ సచివాలయ పరిధిలోని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి లక్ష్మమ్మ, మలేకరి కటిక సుబ్బారావులకు సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పింఛన్లు అందజేశారు. అంతకముందు జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దేవేంద్రప్ప పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలో దాదాపు 98.04 శాతానికి పైగానే సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 11,717 మంది పింఛన్‌దారులు ఉండగా 11,485 మందికి పంపిణీ చేశారు.

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో గురువారం తెల్లవారకముందే పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో అలివేలమ్మ, టీడీపీ నాయకులు గొడుగు సతీష్ కుమార్, భీమరాజు, నాగప్ప తదితరులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో మొత్తం 97 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు.

తుగ్గలి: ముక్కెళ్ల, పెండెకల్ ఆర్ఎస్, చెన్నంపల్లి, అమీనాబాద్, రాంపురం, గిరిగిట్ల తదితర గ్రామాల్లో ఉదయం ఆరు గంటలకే పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, వెంకటపతి, తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలో 99 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఇద్రుస్ భాషా తెలిపారు. మండలంలోని జిలెలబుడకలలో టీడీపీ రాష్ట్ర నాయకురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, నేలతలమర్రిలో మండల కన్వీనర్ విజయభాస్కర్, దేవనకొండలో మండల టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న పింఛన్లు పంపిణీ చేశారు.

ఆలూరు/హొళగుంద: హొళగుంద దిడ్డి కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు వీరభద్ర గౌడ్ ప్రారంభించారు. ఆలూరు పట్టణంలోని కోట వీధిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆలూరు మండలం అరికెర తండా గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ పంపిణీ చేశారు.

ఆలూరు రూరల్: ఆలూరు మండలంలోని మొలగవల్లి, కొట్టాల, కురవళ్ళి, కురకుంద, పెద్దహోతూరు తదితర గ్రామాల్లో ఉదయం 6 గంటలకే సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొలగవల్లి గ్రామంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామనాథ్ యాదవ్, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, కటారు కొండ శీనప్ప, మొలగవల్లి సర్పంచు మోహన్ రాజ్, టీడీపీ మండల కన్వీనర్ అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక సచివాలయ అధికారులతో కలిసి మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్ నాయకత్వంలో టీడీపీ నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి గురువారం పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంజప్ప, రాఘవేంద్ర, శినప్ప, ఎంపీటీసీ రహిమతుల్లా, శేషిరెడ్డి, సతీష్ కుమార్, సాలి సాహెబ్, వీరేష్ పాల్గొన్నారు.

ఆదోని టౌన్: గురువారం ఉదయం ప్రారంభించిన పింఛన్ల పంపిణీలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి పాల్గొని స్వయంగా పింఛన్ పంపిణీ చేశారు. 18వ వార్డులోని ఇందిరా నగర్‌లో దివ్యాంగుడికి ఆయన పింఛన్ అందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరనాథ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: కౌతాళంలో ఉదయం ఎంపీడీవో రఘునాథగుప్త, సచివాలయ సిబ్బంది, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, టౌన్ అధ్యక్షుడు కాశీవిశ్వనాథతో కలిసి శివప్పనగర్, 1వ వార్డులో పింఛన్లు అందజేశారు. ఎరిగేరి, కౌతాళంలోని కబ్బేరు వీధిలో సతీష్ నాయుడు, వీరేష్ మూకన్నలు, గోతులదొడ్డిలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, వల్లూరులో తెలుగు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్ పింఛన్ల పంపిణీలో చురుకుగా పాల్గొన్నారు.

పెద్దకడబూరు: చిన్నకడబూరులో టీడీపీ నాయకుడు నరసన్న పింఛన్ పంపిణీ చేశారు. నాయకుడు విజయ్, అంజి పింఛన్లు అందజేశారు.

గోనెగండ్ల: మండల వ్యాప్తంగా 28 గ్రామాల్లో 9140 పింఛన్‌లనుగాను సాయంత్రం లోపు 8940 పింఛన్‌ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సోనుబాయి తెలిపారు. దాదాపు 99 శాతం పూర్తి చేశామని చెప్పారు.

కోసిగి, ఆగస్టు 1: కోసిగిలోని 9వ వార్డులోని రామక్కమ్మవ్వ కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు టీడీపీ నాయకుడు ఎన్.రాఘవేంద్ర రెడ్డి అంజేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభావతి మాట్లాడుతూ 97 శాతం పింఛన్ల పంపిణీ నమోదైందన్నారు. కార్యక్రమంలో ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, అయ్యన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం, చిలకలడోన, వగరూరు, తిమ్మాపురం గ్రామాల్లో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు రూ.4వేలు అందజేశారు. కార్యక్రమంలో పన్నగ వెంకటేశ్ స్వామి, ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, చిన్నభీమా, సుంకప్ప, నరసింహ, అండే హనుమంతు, వగరూరు అబ్దుల్లా, కేశన్న పాల్గొన్నారు.

పత్తికొండ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గురువారం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొన్నారు. పట్టణంలోని కుమ్మరి వీధిలో ఇంటింటికి తిరిగి వృద్ధులు, వికలాంగులకు ఆయన పింఛన్ అందించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, లోక్‌నాథ్, బీటీ గోవిందు, శ్రీనివాసులుగౌడ్, తిప్పన్న, వాకిటి శ్రీనులతోపాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఎమ్మిగనూరు: పట్టణంలోని కోర్టు వీధి, మునెప్ప నగర్ ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ల దగ్గరకు వెళ్లి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పింఛన్లు అందజేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు, కౌన్సిలర్లు ముల్లాఖలీముల్లా, ఇసాక్, చంద్రమోహన్ రెడ్డి, అమాన్, సోములగూడూరు బాషా, సలీం, కేఎండీ ఫారుక్ పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని నదీకైరవాడి గ్రామంలో సచివాలయ సిబ్బందితో కలిసి ఐ-టీడీపీ అధ్యక్షుడు వీరేష్ పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ తీసుకోకున్నా..

మద్దికెర, ఆగస్టు 1: మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన నేష రాధమ్మ అనే మహిళ పింఛన్ తీసుకోకున్నా కూడా ఆన్‌లైన్‌లో తీసుకున్నట్లు చూపించింది. గురువారం గ్రామ సచివాల య పంచాయతీ అధికారులు పింఛన్ పంపిణీ చేపట్టారు. నేష రాధమ్మ పింఛన్ తీసుకునేందుకు బయోమెట్రిక్ వేయగా తీసుకున్నట్లు చూపించిం ది. తాను తీసుకోకున్నా అలా చూపిస్తే తన పరిస్థితి ఏంటని అడిగినప్పటికీ తామేమీ చేయలే మని అధికారులు సమాధానం ఇచ్చారు. గత నెల కూడా రూ.7వేలు తీసుకున్నానని, ఇప్పుడు రాకపోవడం ఏమిటని ప్రశ్నించింది. సచివాలయ అధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

వెల్దుర్తి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

వెల్దుర్తి, ఆగస్టు 1: వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బిందు మాధవ్ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని నేర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బొమ్మిరెడ్డిపల్లె పికెటింగ్‌ను పరిశీలించి గ్రామంలో నెలకొన్న పరిస్థితులను, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమంలో సీఐ మధుసూదనరావు, ఎస్ఐ సునీల్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు అమృతం

కోసిగి, ఆగస్టు 1: పుట్టిన బిడ్డకు తల్లి పాలే అమృతంగా పని చేస్తాయని మండల వైద్యాధికారి అభిరూప్ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా గురువారం కోసిగిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.అభిరుప్, డా.మౌనిక మాట్లాడుతూ అంతరాలు లేకుండా పాలు ఇచ్చే తల్లులందరికీ మద్దతు ప్రకటిద్దామన్నారు. శిశువు పుట్టిన గంటలోపు తల్లిపాలను అందించడం మంచిదని తెలిపారు. రెండేళ్లపాటు కొనసాగించడంతో పాటు సురక్షితమైన పోషకాహారాన్ని పరిచయం చేయడంపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కోటేశ్వరమ్మ, ఎల్లప్ప, శ్రీనివాసులు, రాముడు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

వెల్దుర్తి, ఆగస్టు, 1: తల్లి పాలు అన్నింటికన్నా శ్రేయస్కరమని, పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. గురువారం కొసనపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఆరు నెలల వరకు తల్లి పాలు తప్ప ఏ ఇతర ద్రవపదార్థాలు బిడ్డకు తాగించకూడదన్నారు. బిడ్డకు పాలివ్వడం వలన తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అదేవిధంగా తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటివి రావని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుమలత, హెల్పర్ ఫాతిమా పాల్గొన్నారు.

పంటలకు హంద్రీ నీరు వదలాలి

దేవనకొండ, ఆగస్టు 1: వర్షాలు కురవక పంటలు పండిపోయో తరుణంలో హంద్రీనీవా ద్వారా నీరుచ్చి రైతులను ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు మునిస్వామి అన్నారు. గురువారం మండలంలోని కుంకనూరు రెవెన్యూ పరిధిలోని పంట పొలాలను పరిశీలించారు. వర్షాలు లేక పంటలు బెట్టతో దిగుబడి ఆశాజనకంగా ఉండకపోవచ్చన్నారు. ప్రభుత్వం మండలంలోని రైతులకు హంద్రీనీవా నీరు మళ్లించి పంటలను సంరక్షించాలని కోరారు. జలవనరుల మంత్రి జోక్యం చేసుకొని హంద్రీనీవా నీటిని కాలువలకు వదిలాలని అన్నారు. కార్యక్రమంలో రహిమాన్, షఫీ, ధర్మ, షేకన్న, వలి పాల్గొన్నారు.

గ్రామ చావిడిని తొలగించాలి

మద్దికెర, ఆగస్టు 1: మద్దికెరలోని మెయిన్‌బజారులో గల శిథిలావస్థలో ఉన్న గ్రామ చావిడిని తొలగించాలని సర్పంచ్ బండారు సుహాసిని కోరారు. గురువారం స్థానిక సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధికారులు అనుమతులు ఇస్తే గ్రామ చావిడిని పగులకొట్టి గదులు ఏర్పాటు చేస్తామని అన్నారు.

చంద్రబాబుతోనే వేదవతి సాధ్యం

హాలహర్వి, ఆగస్టు 1: ఆలూరు ప్రాంతం సస్యశ్యామలం కావలంటే వేదవతి ప్రాజెక్టు కీలకమని, అది ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే పూర్తవుతుందని టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలానికి రూ.20కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. చింతకుంట, బాపురం గ్రామాల్లో తాగునీటి పథకాలకు త్వరలో నిధులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కామినహాల్ రమేష్, సర్పంచ్ మల్లికార్జున, కిశోర్, శ్రీధర్, ప్రహ్లాదరెడ్డి, చిన్ని కృష్ణమనాయుడు పాల్గొన్నారు.

డీపీ 86 కాలువకు నీరు విడుదల

గోనెగండ్ల, ఆగస్టు 1: తుంగభద్ర కాలువ నీరు గోనెగండ్ల సెక్షన్‌కు చేరడంతో గురువారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ హైమావతి, మండల టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్‌తో పాటు మరికొంత మంది టీడీపీ నాయకులు ఎల్లెల్సీ నీటికి హారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం డీపీ 86 కాలువకు నీటిని విడుదల చేశారు. అలాగే మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో గురువారం ఎంపీఎస్ స్కీం పనులకు మండల టీడీపీ కన్వీనర్ నజీర్ సాహెబ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి భూమి పూజ చేశారు.

తలారి అరెస్టు

ఆదోని రూరల్ ఆగస్టు 1 : ఆదోని మండలంలో ఓ సర్పంచ్‌పై అత్యాచారయత్నం చేసి తప్పించుకొని తిరుగుతున్న గ్రామ తలారి నరసింహులును పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఆదివారం సర్పంచ్‌పై అత్యాచారయత్నం జరిగిందనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గురువారం సాంబగల్లు శివారులో ఉన్న అంజనేయస్వామి దేవాలయం వద్ద నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు



వెల్దుర్తిలో అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పత్తికొండ, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టుతీర్పు హర్షణీయమని ఎమ్మె ల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం వర్గీకరణ తీర్పుపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూల తీర్పు ఇవ్వడం అందించడం ఆనందగా ఉందన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చందోలి తిరు పాల్, జిల్లా అధ్యక్షుడు సుభాష్‌చంద్ర, సాంబ శివారెడ్డి, రామానాయుడు, రవి, బోనాల కాశి, నెట్లేకల్లు పాల్గొన్నారు.

మద్దికెర: సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇవ్వడం శుభపరిణామమని హైకోర్టు న్యాయవాది ఎం.అగ్రహారం నెట్టికంటయ్య, సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు అన్నారు. గురువారం సుప్రీంకోర్టు తీర్పుతో సంబరాలు చేసుకున్నారు.

తుగ్గలి: ఎమ్మార్పీఎస్ పోరాటానికి ఫలితం దక్కిందని రాష్ట్ర కో కన్వీనర్ రామకొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడారు. వర్గీకరణ కోసం పోరాడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పులికొండ, నరసింహులు, రంగస్వామి, ఈశ్వరయ్య, తదితరులు ఉన్నారు.

ఆదోని అగ్రికల్చర్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అను కూలంగా తీర్పు ప్రకటించడంపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సంబరాలు చేసు కున్నారు. ఆదోని భీమాస్ కూడలిలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నా రు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల బాలస్వామి, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి నాగప్ప మాట్లాడారు. మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటం ఫలించి యాదవ్ మాదిగ జాతికి న్యాయం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు నరసింహ పీఎస్ వీరేష్, జగత్ పాల్గొన్నారు.

ఆలూరు: ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమనమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి ముత్యాల గాదిలింగ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై గురువారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సుధాకర్, ఆలూరు శేఖర్, అంజి, హాలహర్వి నాయకులు కిషోర్, గంగాధర్, మల్లి, చిప్పగిరి మండల నాయకులు నెట్టే కంటయ్య పాల్గొన్నారు.

● సీఎం చంద్రబాబుతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజినేయులు, మండల నాయకులు బాలరాజు, మసాలా జగన్, గోవింద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణకు సానుకూలంగా ఆర్డినెన్సు జారీ చేయాలన్నారు.

కోసిగి: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సామేల్ ఆధ్వర్యంలో వాల్మీకి సర్కిల్‌లో బాణాసంచా కాల్చారు. అనంతరం స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో దుర్గప్ప, నాగరాజు, చిదానంద, హనుమంతు, రుద్రముణి, సామేల్ రాజు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు యువరాజు, సతీష్ ఆనందం అన్నారు. గురువారం మాట్లాడుతూ వర్గీకరణ సాధనతో మందకృష్ణ మాదిగ చరిత్రలో నిలిచిపోతారన్నారు.

వెల్దుర్తి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బజారు మాదిగ అన్నారు. గురువారం పాత బస్టాండ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు, క్షీరాభిషేకం చేసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గిడ్డయ్య, ఐజయ్య, మోష, బాలరాజు, సూర్యచంద్ర, ప్రకాష్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: మాదిగల పోరాటం ఫలిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ అన్నారు. గురువారం గోనెగండ్ల బస్టాండ్ ప్రాంగణంలో అంబేడ్కర్, మందకృష్ణ మాదిగ చిత్రపటా లకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దస్తగిరి, రంగ, పవన్, నగేష్, దేవసహాయం, చంద్ర న్న, రాజేష్, శ్రీనివాసులు,రాజు, మునిస్వామి, రవి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ధర్మాసనం తీర్పు వెలువరించడం హర్షణీయమని టీడీపీ నాయకులు కదిరికోట ఆదెన్న అన్నారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలు, ఇతర ఉపకులాలు 30ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలించిందన్నారు. మాదిగలను అన్ని పార్టీలు మోసం చేస్తే సీఎం నారా చంద్రబాబునాయుడు అండగా నిలిచారని గుర్తు చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు రోజా ఆర్థ్ ఉసేని పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

● కారు, ఆటో సీజ్, ఎనిమిది మంది అరెస్టు



పట్టుకున్న కర్ణాటక మద్యంతో సెబ్ సీఐ, సిబ్బంది

ఎమ్మిగనూరు, ఆగస్టు 1: ఎమ్మిగనూరు సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామ సమీపంలో, మాధవరం చెక్‌పోస్టు దగ్గర గురువారం భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. గురువారం ఎమ్మిగనూరు సెబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ భార్గవ్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట క్రాస్ రోడ్డు వద్ద కర్ణాటక నుంచి ఓ కారులో రచ్చుమర్రి గ్రామానికి చెందిన మజ్జిగ రామకృష్ణ, పోలీ ఈరేష్ అలియాస్ వీరేష్, ఆదోని శివశంకర్, కర్ణాటకలోని గుండ్రేవుల గ్రామానికి చెందిన శివరాజులు కర్ణాటక మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే మాధవరం చెక్‌పోస్టు దగ్గర కర్ణాటక నుంచి ఓ ఆటోలో ఆదోనికి చెందిన షేక్‌మహ్మద్, పింజరి మౌలా, బండి అలి, బండి ఫయాజ్‌లు మద్యాన్ని తరలిస్తుండగా సెబ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ కేసుల్లో ఒక కారు, ఆటోలను సీజ్ చేసి ఎనిమిది మంది నిందితులపై కేసు నమోదు చేశారు. పట్టుకున్న మద్యం విలువ రూ.4.50 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ సత్యనారాయణ, మాధవరం చెక్‌పోస్టు ఈఎస్ఐ రాజశేఖర్, హెచ్‌సీలు పాల్గొన్నారు.

రాఘవరాయలకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఆగస్టు 1: రాఘవరాయల మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. ద్వాదశి వేడుకలు పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి విశేష పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబీ పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న భక్తులకు పీఠాధిపతి ఆశీస్సులు అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు, ఆగస్టు 1: బినామీ పేర్లతో వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ ఆంజినేయులు, చంద్ర డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఉపాధి కూలీల చెంత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది వారాల పాటు పని చేసినా ఉపాధి వేతనాలు అకౌంట్‌లలో జమ కాలేదన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు బోర్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రఫీక్, నరేష్, పోతురాజు, నరసప్ప, లింగన్న, ఎల్లమ్మ, లక్ష్మి, నాగవేణి పాల్గొన్నారు.

రాజకీయ బెదిరింపులు ఆపాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 1: అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లపై రాజకీయ బెదిరింపులు ఆపాలని సీఐటీయూ నాయకుడు రాముడు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి గోవర్ధనమ్మ, నాగలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం దగ్గర వారు విలేకర్లతో మాట్లాడారు. తమ మాట వినని అంగన్వాడీ కార్యకర్తలను కొంతమంది రాజకీయ నాయకులు బెదిరిస్తున్నారని అన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో చిట్టెమ్మ, సునంద, సావిత్రి, పూర్ణిమ, లలితారాణి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చిన సర్పంచ్

పెద్దకడబూరు ఆగస్టు 1: మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో దాదాపుగా పది రోజుల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉండే బోర్లలో నీరు రాకపోవడంతో గ్రామ ప్రజలు పొలాల్లో ఉండే బోర్ల నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామ ప్రజలు సర్పంచ్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా గురువారం ఆయన తాగునీటి బోరు వేయించారు. నీళ్లు పడడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

తహసీల్దార్‌గా చంద్రశేఖర్ వర్మ

వెల్దుర్తి, ఆగస్టు 1: వెల్దుర్తి మండలం తహసీల్దార్‌గా చంద్రశేఖర్ వర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కౌతాళం మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహించేవారు. ఎన్నికల విధులకు సత్యసాయి జిల్లాకు వెళ్లారు. ఎన్నికల అనంతరం ఎవరి సొంత జిల్లాలకు వారిని బదిలీ చేశారు. ఈ బదిలీలలో భాగంగా వెల్దుర్తి మండలం తహసీల్దార్‌గా నియమితులయ్యారు.



చంద్రశేఖర్ వర్మ



హుసేన్ సాహెబ్



జయన్న

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మద్దికెర, ఆగస్టు 1: మండలంలోని ఆయా గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని తహసీల్దార్ హుసేన్ సాహెబ్ అన్నారు. గురువారం మద్దికెర తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్వోలు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి, రషీద్, శ్రీరాములు, మల్లికార్జున, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌గా జయన్న

దేవనకొండ, ఆగస్టు 1: దేవనకొండ తహసీల్దార్‌గా జయన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి బదిలీపై దేవనకొండకు వచ్చారు. ఈ నెల చివరన పదవీ విరమణ చేయనుండటంతో మండలంలో నెల రోజులు మాత్రమే తహసీల్దార్‌గా జయన్న బాధ్యతలు నిర్వహించనున్నారు.

ఎమ్మిగనూరుకు శేషఫణి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 1: ఎమ్మి గనూరు తహసీల్దార్‌గా శేషఫణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ శేషారెడ్డి అనంత పురం జిల్లాకు వెళ్లారు. ఈయన స్థానంలో గుంతకల్లులో పని చేస్తున్న శేషఫణిని జిల్లా ఉన్నతాధికారులు ఎమ్మిగనూరుకు బదిలీ చేశారు.

● **కౌతాళం, ఆగస్టు 1:** కౌతాళం ఎంఈఓ-1గా గురువారం అంజనేయులు పదవీ బాధ్యతలు చేపట్టారు. విద్యాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.